క్లుప్తంగా

నేటి నుంచి దస్తగిరి స్వామి ఉరుసు

పాణ్యం: మండల పరిధిలోని ఎస్.కొట్టాల గ్రామంలో వెలసిన శ్రీదస్తగిరిస్వామి ఉరుసు బుధవారం నుంచి ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. తొలి రోజు గంధం సమర్పణ, 18వ తేదీ భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఉరుసు సందర్భంగా గుండు ఎత్తే పోటీలు, మోకులాగే పోటీలు, కబడ్డీ, బండలాగుడు పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



రాజీనామా పత్రాలను గ్రామ కార్యదర్శికి అందజేస్తున్న వలంటీర్లు

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ గ్రామంలో 8 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. మంగళవారం రాజీనామా పత్రాలను గ్రామ కార్యదర్శి జమాల్‌కు అందజేశారు. అలాగే కొనిదేడులో 12 మంది వలంటీర్లు రాజీనామా చేశారు ఈ ఎన్నికల్లో కాటసాని రాంభూపాల్ రెడ్డి విజయానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



కె.సింగవరంలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

సి.బెళగల్: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులు దరిచేరవని జిల్లా మలేరియా అధికారి నూకరాజు అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. కె.సింగవరం గ్రామంలో డెంగీ అనుమానిత వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయించాలని సర్పంచ్ రవీంద్రనాథ్‌రెడ్డికి సూచించారు. వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట మలేరియా సబ్ యూనిట్ అధికారి రంగస్వామి, హెల్త్ సూపర్‌వైజర్ మద్దిలేటి, ఈఓఆర్డీ సందీప్ ఉన్నారు.

పనులు జరిగే చోట కూలీలకు నీడ సౌకర్యం



గోరంట్లలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ మోదీన్‌బాషా

కోడుమూరు రూరల్: వేసవి దృష్ట్యా కూలీలంతా ఉదయాన్నే ఉపాధి పనులకు వెళ్లి కొలతల ప్రకారం పనులు చేసుకోవాలని ఏపీఓ మొదీన్ బాషా అన్నారు. పనులు జరిగే చోట నీడ, నీటి వసతి కల్పించాలని సిబ్బందికి సూచించారు. మంగళవారం కోడుమూరు మండలంలోని గోరంట్ల గ్రామంలో ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. కూలీల హాజరు, పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లోని కూలీలందరికీ పనులు కల్పిస్తామన్నారు.

గ్యాస్ ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కోడుమూరు రూరల్: గ్యాస్ వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక కేంద్రం ఎస్ఐ మహబూబ్ దౌలత్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని కొండపేటలో గ్యాస్ లీకేజీ, అగ్ని ప్రమాదాల సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై మహిళలకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించే వస్తువులకు చిన్న పిల్లలను దూరంగా ఉంచాలని సూచించారు. గ్యాస్ వినియోగంపై మహిళలు అవగాహన పెంచుకోవాలన్నారు. గ్యాస్ సిలిండర్ వల్ల కలిగే ప్రమాదాలు, నివారణ చర్యలపై అగ్నిమాపక సిబ్బంది ప్రత్యక్షంగా చేసి చూపించారు.

వాల్మీకుల మనోభావాలను దెబ్బతీసిన టీడీపీ

కర్నూలు(అర్బన్): తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బీటీ నాయుడును తొలగించి అగ్రకులానికి చెందిన తిక్కారెడ్డికి ఇవ్వడంపై వాల్మీకుల మనోభావాలను దెబ్బతిన్నాయని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా ఈశ్వరయ్య ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక బీసీ భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇలా ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. జిల్లా అధ్యక్షుడి మార్పు విషయంలో తెలుగుదేశం పార్టీ తప్పటడుగు వేసిందని, పార్టీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని తాము వ్యతిరేకిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు కుంపటి కృష్ణయ్య, మద్దిలేటి, జగన్, నాగరాజు, సురేష్, ప్రసాద్, రాము తదితరులు పాల్గొన్నారు.

బాబు అధికారంలోకొస్తే కరువు తాండవమే

- వైఎస్సార్‌సీపీతోనే అందరికీ న్యాయం
- వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బ్రహ్మానందరెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పోచా బ్రహ్మానందరెడ్డి



ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు: చంద్రబాబు అధికారంలోకొస్తే రాష్ట్రంలో కరువు తాండవమేనని వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, పోచా బ్రహ్మానందరెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం కల్లూరు మండలంలోని సల్కాపురం, ఎ.గోకులపాడు, కె.మార్కాపురం, పెద్దకొట్టాల, పుసులూరు గ్రామాల్లో రోడ్ షో నిర్వహించారు. వారికి ఆయా గ్రామాల ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ ఇంటింటికి వెళ్లి మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలంటూ అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2014 ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో జతకట్టి మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకొచ్చిన చంద్రబాబు తన ఐదేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని దుయ్యబట్టారు. చంద్రబాబు మోసాలను తెలుసుకున్న ప్రజలు 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలిచారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే కరోనా మహమ్మారితో ఆర్థిక ఇబ్బందులు తలెత్తినా పేదల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99శాతం అమలు చేశామన్నారు. ఈ ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా గ్రామ/వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌లను ఏర్పాటు చేసి ప్రజల ఇంటి ముంగిటకే అన్ని సేవలు తీసుకొచ్చారని తెలిపారు. అర్హతే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు అందించామని చెప్పారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాను గమనించి ఓటు వేయాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు వస్తాయని, పేద ప్రజలకు న్యాయం జరగదన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో పేదలకు న్యాయం జరగడంతో పాటు వారి జీవన ప్రమాణాలు మెరుగయ్యాయని తెలిపారు. ప్రజల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 330 సార్లు బటన్ నొక్కారని, సార్వత్రిక ఎన్నికల్లో మీరు రెండు సార్లు బటన్ నొక్కాలని కోరారు. అసెంబ్లీకి ఒకటి, పార్లమెంట్‌కు ఒకటి రెండు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోయ శారద, కార్పొరేటర్లు లక్ష్మీకాంతరెడ్డి, శ్వేతారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, శీను, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నేడు పన్ను చెల్లింపు కౌంటర్లు పనిచేస్తాయి

కర్నూలు (టౌన్) : శ్రీరామ నవమి పర్వదినమైన బుధవారం రోజు కూడా నగరపాలక కార్యాలయంలో ఆస్తి పన్ను చెల్లింపు కౌంటర్లు పనిచేస్తాయని నగరపాలక మేనేజర్ చిన్నరాముడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెలాఖరులోపు 2024–2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏకమొత్తంలో పన్ను చెల్లించే పన్నుదారులకు ప్రభుత్వం 5 శాతం రాయితీ కల్పించిందన్నారు. పన్నుదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు.

హుసేనాపురం వలంటీర్ల రాజీనామా

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామానికి చెందిన 11 మంది వలంటీర్లు మంగళవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాలను ఎంపీడీఓ మల్లీశ్వరికి అందజేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవడానికి తామంతా కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యేగా కాటసాని రాంభూపాల్‌రెడ్డిని గెలిపించుకుంటామని చెప్పారు. వలంటీర్ల రాజీనామాలను ఆమోదించినట్లు ఎంపీడీఓ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

- ఎన్నికల ప్రచారంలో కాటసాని ఉమామహేశ్వరమ్మ



ఉయ్యాలవాడలో ప్రచారం నిర్వహిస్తున్న ఉమామహేశ్వరమ్మ

ఓర్వకల్లు: వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం మండలంలోని ఉయ్యాలవాడ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే గొల్లపేట, తెలుగుపేట, మైనార్టీ కాలనీ, కాపపేట, బీసీ కాలనీ, ఎస్సీ కాలనీలో విస్తృతంగా పర్యటించారు. గడప గడపకు వెళ్లి పాణ్యం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటి చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి, నంద్యాల ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిని అత్యధిక మెజారీతో గెలిపించాలని కోరారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి వస్తే, నిరుపేదలకు మరింత ఆర్థిక చేయూత లభిస్తుందన్నారు. వచ్చే నెల 13వ తేదీ జరిగే ఎన్నికల్లో ఫ్యాన్‌గుర్తుపై ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుక, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, సర్పంచ్ శకుంతలమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు సరోజమ్మ, స్థానిక నాయకులు బొమ్మన రామరెడ్డి, నాగేశ్వరరెడ్డి, న్యాయవాది నరేంద్రనాథ్‌రెడ్డి, మదన్‌గోపాల్‌రెడ్డి, పల్లె మోహన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మధుమోహన్‌రెడ్డి, శివారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని కూటములు వచ్చినా వైఎస్సార్‌సీపీదే విజయం



చిందుకూరులో ప్రచారం చేస్తున్న కాటసాని శివ నరసింహారెడ్డి

గడివేముల: ఎన్ని పార్టీలు జతకట్టినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరని.. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తనయుడు శివ నరసింహారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం గడివేముల మండల పరిధిలో చిందుకూరులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రెండు అమూల్యమైన ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో చేసే మోసపూరిత మాటలు నమ్మి ఎవరూ మోసపోవద్దన్నారు. సంక్షేమం అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. ఎమ్మెల్యేగా కాటసాని రాంభూపాల్ రెడ్డి గెలిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తారని తెలిపారు. టీడీపీ నాయకులు సీఎం జగన్‌పై ఎన్ని కుట్రలు చేసినా అంతిమ విజయం తమదేనన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్బీ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట కృష్ణారెడ్డి, నాయకులు ఎల్లారెడ్డి, దస్తగిరిరెడ్డి, ఆనంద్ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, రమేష్, తిరుపంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారాముల కల్యాణోత్సవం



పూజలందుకున్న స్వామివారు

కోడుమూరు రూరల్: శ్రీరామనవమి పురస్కరించుకుని స్వామివారి కల్యాణం నిర్వహించేందుకు మండలంలోని రామాలయాలు ముస్తాబయ్యాయి. కోడుమూరులోని రాములవారి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుధవారం కల్యాణోత్సవాన్ని నిర్వహించేందుకు ఎస్ఎస్‌కే సమాజ్ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కల్యాణోత్సవం కోసం ఈ ఏడాది నూతనంగా ఉత్సవ విగ్రహాలను చేయించారు. మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని వర్కూరులోని రామాలయంలో ఉదయం స్వామివారి కల్యాణం, సాయంత్రం రథోత్సవాన్ని నిర్వహించేందుకు గ్రామస్తులు ఏర్పాట్లు చేశారు.

గూడూరు రూరల్: శ్రీరామనవమిని పురస్కరించుకుని మండల పరిధిలోని గుడిపాడు, కె.నాగలాపురం, బూడిదపాడు, చనుగొండ్ల తదితర గ్రామాల్లో బుధవారం సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఆయా గ్రామాల్లోని రామాలయాలను పుష్పాలు, విద్యుత్ దీపాలతో సుందరంగా ముస్తాబు చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు కల్యాణ్యాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ పెంచలయ్య

కర్నూలు (టౌన్) : ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి పౌరుడు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు డాక్టర్ పెంచలయ్య అన్నారు. మంగళవారం స్వీప్ ఆధ్వర్యంలో నగరంలోని స్థానిక 167 నుంచి 175 వరకు ఉన్న పోలింగ్ స్టేషన్ల పరిధిలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వీప్ (సిస్టమేటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్, ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో నగరంలోని ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వచ్చే నెలలో ఎన్నికల కమిషన్ నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల్లో మనందరం ఓటు వేసి ప్రజా ప్రభుత్వాన్ని ఎన్నుకుందామన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ఓర్వకల్లు మండలం గుట్టపాడు గ్రామానికి చెందిన 30 కుటుంబాలు మంగళవారం రాత్రి టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. గుట్టపాడు గ్రామానికి చెందిన లక్ష్మీకాంత రెడ్డి, పెద్ద సుంకిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన చిన్నస్వామి రెడ్డి, ట్రాక్టర్ రాముడు, తప్పెట స్వాములు (టీడీపీ వార్డు సభ్యుడు), మద్దిలేటి, మల్లయ్య, అయ్యన్న, అక్బర్ వలి, చాకలి విజయ్, చిన్నసుంకన్న (టీడీపీ వార్డు సభ్యుడు) చేరారు. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మంచి చేసి ఉంటేనే ఓటు వేయండి అని అడుగుతున్న దమ్మున్న నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. ప్రజాసంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ పాలన సాధ్యం

- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, ఆదిమూలపు సతీష్
- కొత్తకోటలో ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రామయ్య, సతీష్

సి.బెళగల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని ఆ పార్టీ కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య అన్నారు. మంగళవారం సి.బెళగల్ మండలం కొత్తకోట గ్రామంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్, మాజీ ఎమ్మెల్యేలు కొత్తకోట ప్రకాష్‌రెడ్డి, మణిగాంధీతో కలిసి ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే సేవలు అందించారని చెప్పారు. ఈ సేవలు ఇలానే కొనసాగాలంటే రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు వేయాలని కోరారు. టీడీపీ సూపర్ సిక్స్ పథకాలంటూ ప్రచారం చేస్తోందని, గతంలో ఇచ్చిన సూపర్ 600 హామీలను తుంగలో తొక్కిన విషయాన్ని మరిచిపోవద్దని సూచించారు. టీడీపీ కూటమి సభ్యులకు బుద్ధి చెప్పాలని కోరారు.

అందుబాటులో ఉంటా.. ఆశీర్వదించండి



వృద్ధురాలికి పథకాలను వివరిస్తున్న రామయ్య, సతీష్

కోడుమూరు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని.. తనను గెలిపించాలని ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ కోరారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఎంపీపీ బొంతల మునెప్ప, కర్నూలు, గూడూరు జెడ్పీటీసీ సభ్యులు ప్రసన్న బాబు, మౌలాలి, సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యులు శోభారాణి, మణిమోహన్‌రెడ్డి, నడిపి సోమన్న, పార్టీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, నాయకులు తులసిరెడ్డి, రవీంద్రరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ గోపాల్‌రెడ్డి, మాజీ చైర్మన్ సీబీ గోవింద రెడ్డి, ధనుంజయ ఆచారి, లక్ష్మికాంతయ్య, ఎస్ఎం బాషా, ప్రశాంత్, నాగేశ్వరరెడ్డి, జగదీశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షలో 352 మందికి వైద్య సేవలు



పోలకల్‌లో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హరిచంద్రుడు

సి.బెళగల్: మండలంలోని పోలకల్ మెయిన్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ హరిచంద్రుడు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 352 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మంచానికే పరిమితమైన వారి ఇళ్లకు వెళ్లి వైద్య సేవలు అందించారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతోందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఈఓఆర్డీ సందీప్ అన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు కుల్సుమ్, అఫ్జల్, కంటి వైద్య నిపుణుడు సంపత్ పాల్గొన్నారు.

అవసరమైన వారందరికీ పరీక్షలు



కంటి పరీక్ష చేస్తున్న వైద్యుడు

కల్లూరు: ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా అవసరమైన వారందరికీ పరీక్షలు చేసి మందుల అందించామని కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ మోతీలాల్ నాయక్ అన్నారు. బొల్లవరం గ్రామంలో మంగళవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు మధుమేహం, బీపీ, హిమోగ్లోబిన్, కంటి తదితర పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు.

భక్తిశ్రద్ధలతో బడేషా ఖాద్రి ఉరుసు



గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

సి బెళగల్: మండలంలోని గుండ్రేవుల గ్రామంలో మంగళవారం బడేషా ఖాద్రి ఉరుసు భక్తిశ్రద్ధలతో జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున దర్గాకు చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గాజుల, బొమ్మలు, మిఠాయి దుకాణాల వద్ద కొనుగోలుదారులతో సందడి నెలకొంది. అలాగే ఇనగండ్ల గ్రామంలో ఉరుసు ఘనంగా జరిగింది.

రేపటి నుంచి నామినేషన్ల స్వీకరణ



సమావేశంలో మాట్లాడుతున జేసీ నారపురెడ్డి మౌర్య

- పాణ్యం నియోజకవర్గానికి జేసీ చాంబరులోనే నామినేషన్లు
- ఎన్నికల అధికారి నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): సాధారణ ఎన్నికల్లో భాగంగా పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్లను జాయింట్ కలెక్టర్ చాంబరులో స్వీకరించనున్నట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి, జేసీ నారపురెడ్డి మౌర్య తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఆర్ఓ కార్యాలయంలోనే నామినేషన్లను స్వీరించాల్సి ఉన్నందున తన చాంబరులో స్వీకరణకు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మంగళవారం తన చాంబరులో పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఈ నెల 18వ తేదీ నుంచి నామినేషన్లను స్వీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థితోపాటు నలుగురికి ఆర్ఓ కార్యాలయంలోకి అనుమతి ఇస్తామన్నారు. అభ్యర్థులు తమ వాహనాలను 100 మీటర్ల దూరంలోనే నిలుపుదల చేయాలన్నారు. మూడు వాహనాలను మాత్రమే వినియోగించాలన్నారు. నామినేషన్ వేసే ప్రక్రియలో ఏమైనా అనుమానాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నుంచి సురేష్, టీడీపీ నుంచి చత్రపతిరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో నీటి సమస్య రానీయొద్దు

- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ బోయ శారద



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బోయ శారద

కల్లూరు: వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ బోయ శారద అధికారులకు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులు శాఖల వారిగా ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. గ్రామాల్లో నీటి సమస్యలను ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని.. అవసరమైన చోట్ల ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేలా చూడాలన్నారు. ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండడంతో మండలంలోని యాపర్లపాడు, కె.మార్కాపురం, పెద్దకొట్టాల, సల్కాపురం, నెరవాడ, ఎ.గోకులపాడు గ్రామాల్లో నీటి సమస్య వచ్చే అవకాశం ఉందని.. తగిన చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఈ ఏడాది (ఏప్రీల్) నుంచి దినసరి వేతనం రూ. 272 నుంచి రూ. 300 పెంచినట్లు ఏపీఓ మద్దేశ్వరమ్మ తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన కొలతల ప్రకారం పని చేస్తే కూలీలకు పూర్తి వేతనం వస్తుందన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఉదయం 5.30 గంటలకు ఉపాధి కూలీలు పనులకు వచ్చేలా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలని కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ శైలేష్ కుమార్ అన్నారు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా ఎక్కువగా పళ్ల రసాలు, మజ్జిగ, ద్రావణాలు తీసుకోవాలని సూచించారు. ఎండ తీవ్రంగా ఉన్న సమయంలో బయటకు రాకుండా ఉండాలన్నారు. అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకెళ్లాలన్నారు. సర్వసభ్య సమావేశానికి విద్యుత్‌శాఖ అధికారులు హాజరుకావడం లేదని పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీవీ రణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

21న బాల వికాస పాఠశాలల జిల్లా వార్షికోత్సవం

కర్నూలు కల్చరల్: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన బాల వికాస పాఠశాలల జిల్లా వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.డి.వి.జోగయ్య శర్మ తెలిపారు. బుధవార పేట కేశవ మెమోరియల్ పాఠశాలలో గుమ్మితం తాండ, కన్నమడకల, డి.బెళగల్, కుంకనూరు పాఠశాలల వార్షికోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు. కర్నూలు ఇస్కాన్ మందిరం రఘునందన సేవక దాసు, లలితా పీఠం పీఠాధిపతి సుబ్రహ్మణ్యం అతిథులుగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.